నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, శనివారం 20 జనవరి 2024 | NALGONDA

## జాన్‌పహాడ్ దర్గాకు పోటెత్తిన భక్తులు

పాలకవీడు, జనవరి 19 : మండలంలోని జాన్‌పహాడ్ దర్గాకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఈ నెల 25నుంచి దర్గా ఉర్సు ప్రారంభం కానుండగా.. ఇప్పటి నుంచే సైదులు బాబా సమాధుల దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారని దర్గా ముజావర్ జానీ తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున రావడంతో దర్గా పరిసరాలు కిక్కిరిశాయి.



జాన్‌పహాడ్ దర్గా వద్ద భక్తులు




# ఎస్ఎంసీ ఎన్నికలకు మోగిన గంట

## నేడు నోటిఫికేషన్ విడుదల.. 29న ఎన్నికలు

- షెడ్యూల్ విడుదల చేసిన విద్యాశాఖ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,088 పాఠశాలల్లో ఎన్నికలు
- చేతులెత్తే విధానం, అవసరమైతే రహస్య బ్యాలెట్‌తో ఎన్నిక



రామగిరి, జనవరి 19 : ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) పాత్ర కీలకమైంది. ఆయా పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లి దండ్రులు, సంరక్షకులతో ఏర్పాటు చేసే ఈ కమిటీల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర విద్యా శాఖ షెడ్యూల్‌ను విడుదల చేసింది. 30 నవంబర్ 2019 తర్వాత మళ్లీ ఈ నెల 20న నోటిఫికేషన్ విడుదల చేయనుండగా ఈ నెల 29న ఎన్నికలు జరుగనున్నాయి. దాంతో పాఠశాలల్లో ఎన్నికల సందడి మొదలు కానున్నది. జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో వీటి ప్రక్రియ కొనసాగనున్నది.

### ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,088 పాఠశాలల్లో..

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని 3,088 పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణతో నూతన కమిటీలు ఏర్పాటు కానున్నాయి. ప్రభుత్వ, జిల్లా పరిషత్, కస్తూర్బా, మోడల్, యూఆర్ఎస్, టీఎస్ఆర్ఈఐఎస్, వివిధ శాఖల గురుకుల స్కూళ్లతోపాటు ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు ఓటర్లుగా ఈ ఎన్నికల్లో పాల్గొననున్నారు.

### సుదీర్ఘ కాలం తర్వాత...

గతంలో 18 నవంబర్, 2019లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేయగా 30 నవంబర్, 2019లో ఎన్నికలు నిర్వహించి కమిటీలను ప్రకటించారు. వీటి పదవీ కాలం 30 నవంబర్, 2021తో ముగియగా కొవిడ్ నేపథ్యంలో పాఠశాలల నిర్వహణ సాగలేదని తమకు న్యాయం చేసి మళ్లీ అవకాశం ఇవ్వాలని ఆయా కమిటీ సభ్యులు, చైర్మన్లు ప్రభుత్వానికి విన్నవించడంతో పదవీకాలం పొడగించారు. దాంతో ఆ కమిటీలు సుదీర్ఘకాలం పనిచేశాయి. తాజాగా ప్రభుత్వం మళ్లీ నూతన కమిటీల కోసం షెడ్యూల్ జారీ చేసింది.

**పాఠశాలల వివరాలు**

| జిల్లా | పాఠశాలలు | విద్యార్థులు |
|---|---|---|
| నల్లగొండ | 1485 | 1,03,877 |
| సూర్యాపేట | 909 | 63,805 |
| యాదాద్రి | 694 | 53,248 |
| మొత్తం | 3,088 | 2,27,345 |

### షెడ్యూల్ ఇలా..

- 20న ఉదయం 10 గంటలకు ఎన్నిక నోటిఫికేషన్‌ను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2గంటలకు అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రుల ఓటర్ల జాబితా ప్రకటన
- 22న సాయంత్రం 4గంటల వరకు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ
- 24న ఉదయం 11గంటలకు తుది జాబితా విడుదల
- విడుదల చేసి ఓటర్ల జాబితాలో 50శాతం మంది హాజరైతేనే ఎన్నిక ఉంటుంది. ఎన్నికలను చెతులెత్తే పద్ధతిగానీ, వాయిస్ ఓట్ ద్వారా నిర్వహిస్తారు. అలా జరుగకుంటే రహస్య ఓటింగ్ చేస్తారు.
- 29న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఎస్ఎంసీ సభ్యుల ఎన్నికల నిర్వహణ. ఎస్ఎంసీ సభ్యుల ఎన్నిక, చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక ఉంటుంది. మధ్యాహ్నం 2గంటల నుంచి 4గంటల వరకు నూతన కమిటీ సమావేశం నిర్వహిస్తారు.

### సభ్యుల ఎన్నిక ఇలా ...

- ఎన్నికల్లో 1నుంచి 8వ తరగతి వరకు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొంటారు. 9,10 తరగతులు చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు కమిటీల్లో అవకాశం ఉండదు.
- ప్రతి తరగతికి ముగ్గురు సభ్యులను ఎన్నుకుంటారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉండగా ఒకరు మాత్రం ప్రతి కూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వారి పిల్లలు, అనాథ, ఎస్సీ, ఎస్టీ, వలస, వీధి బాలలు, ప్రత్యేకావసరాలున్న పిల్లల తల్లి లేదా తండ్రి ఉండాలి. మరొకరిని బీసీ, మైనార్టీకి చెందిన తల్లిదండ్రుల నుంచి ఒకరిని, మూడో వ్యక్తిని ఎవరినైనా ఎంపిక చేయవచ్చు.
- ప్రాథమిక పాఠశాలల్లో 5 తరగతులుంటే తరగతికి ముగ్గురు చొప్పున 15 మందిని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 7వ తరగతి వరకు ఉంటే 21 మందిని, 8వ తరగతి వరకు ఉంటే 24మంది సభ్యులను, ఉన్నత పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల తల్లిదండ్రుల్లో 9మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది.

### ఎస్ఎంసీల విధులు ఇవే...

- గ్రామంలోని బడీడు పిల్లలను విధిగా పాఠశాలల్లో చేర్పించడం. విద్యార్థుల విద్యా సామర్థ్యాల పెంపునకు కృషి చేయడం.
- గ్రామాల్లోని దాతలు, ప్రజా ప్రతినిధుల నుంచి నిధులు సేకరించి విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడం.
- ప్రతి మాసం సమావేశాలు ఏర్పాటు చేసి పాఠశాల అభివృద్ధికి కావాల్సిన ప్రణాళికలు తయారు చేసి అమలుకు చర్యలు తీసుకోవడం.
- ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు విధానాన్ని పరిశీలించి, నిధులు సక్రమంగా ఖర్చుపెట్టేలా పర్యవేక్షణ చేయడం.
- మధ్యాహ్నం భోజనం పర్యవేక్షణ చేయడం.
- జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఆదేశాలతో ప్రతి కార్యక్రమం అమలు చేయాల్సిన బాధ్యత ఎస్ఎంసీపై ఉంటుంది.

### ప్రధానోపాధ్యాయులే కన్వీనర్‌గా..

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. మరో సీనియర్ ఉపాధ్యాయులు, వార్డు/కౌన్సిలర్/ఏఎన్ఎం, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, అంగన్‌వాడీ కార్యకర్త ఎక్స్ అఫిషియో సభ్యులుగా వ్యవహరిస్తారు. ఎన్నికైన సభ్యులతో పాటు ఆరుగురు ఎక్స్ అఫిషియో సభ్యులు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు ఉంటారు. ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికైన 15 మందితో పాటు ఆరుగురు ఎక్స్ అఫిషియో సభ్యులు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులతో మొత్తం 23 మంది ఉంటారు. ఏడో తరగతి వరకు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో 29 మంది, 8వ తరగతి వరకు ఉన్న పాఠశాలల్లో 32 మంది, హైస్కూళ్లలో మొత్తం 17 మంది సభ్యులుంటారు. ఆయా పాఠశాలల పరిధిలో విద్యావేత్త, పాఠశాల అభివృద్ధికి సహకరించే దాతలను ఎస్ఎంసీ కోఆప్షన్ సభ్యులుగా నియమించుకునే అవకాశం ఉంది. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి లేదా విద్యార్థుల్లో ఇద్దర్ని కోఆప్షన్ చేసుకోవచ్చు. గ్రామ పంచాయతీ సర్పంచ్, మున్సిపల్ చైర్మన్లు సమావేశాలకు హాజరయ్యే హక్కు ఉంటుంది.

### షెడ్యూల్ ప్రకారం ఎస్ఎంసీల ఎన్నికలు

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ నెల 20న ఆయా పాఠశాలల హెచ్ఎంలు నోటిఫికేషన్ జారీ చేస్తారు. నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితా సిద్ధం చేసి వెల్లడించాల్సి ఉంటుంది. ఈ నెల 29న అన్ని పాఠశాలల్లో ఎన్నిక జరుగుతుంది. ఆ తర్వాత సభ్యుల, ఎక్స్ అఫిషియో , చైర్మన్ ఎంపిక పూర్తి చేసి తొలి సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది.

–బి.భిక్షపతి, డీఈఓ, నల్లగొండ



పెద్దవూర : పులిచర్లలో వికసిత్ భారత్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే

## దేశాన్ని అగ్రస్థానంలో నిలుపడమే లక్ష్యం

- కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే

పెద్దవూర, జనవరి 19 : ప్రపంచంలో భారత దేశాన్ని అగ్రస్థానంలో నిలుపడమే లక్ష్యంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పని చేస్తున్నారని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ మహేంద్రనాథ్ పాండే అన్నారు. మండలంలోని పులిచర్ల గ్రామంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశం, వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం అందించడమే వికసిత్ భారత్ లక్ష్యమన్నారు. దేశంలోని 6.50 లక్షల గ్రామాల్లోకి వికసిత్ భారత్ వెళ్తుందని తెలిపారు. మోదీ హయాంలో తెలంగాణలో రూ.వెయ్యి కోట్లతో ఎయిమ్స్ నిర్మించామని, జాతీయ రహదారులు 2500 నుంచి 5వేల కిలోమీటర్లకు పెంచామని, రైల్వే లైన్లు రెట్టింపు చేశామని చెప్పారు. పేద మహిళలకు ఉచితంగా వంట గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. దేశ వ్యాప్తంగా 2కోట్ల మంది మహిళలను లక్షాధికారులను చేయడం ప్రధాన మంత్రి లక్ష్యమని ప్రకటించారు. ఆయుష్మాన్ భారత్ కింద పేదలందరికీ రూ.5లక్షల వరకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రశాంత్ కిశోర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం బరియార్, రీజినల్ మేనేజర్ అలీముద్దీన్, జిల్లా నోడల్ అధికారి శ్రామిక్, నాబార్డు జిల్లా మేనేజర్ వినయ్‌కుమార్, ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి కోటేశ్వర్‌రావు, డీఆర్‌డీఓ కాళిందిని, డీఎంహెచ్ఓ డాక్టర్ కొండల్‌రావు, మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య, ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి అధికారులు పాల్గొన్నారు.



ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

## నేడు, రేపు ఓటు నమోదుకు ప్రత్యేక క్యాంపెయిన్

- కలెక్టర్ హరిచందన

నల్లగొండ, జనవరి 19 : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఓటరు జాబితా సవరణలో భాగంగా 18 ఏండ్లు నిండి ఓటరుగా నమోదు కాని వారు తమ ఓటును నమోదు చేసుకోవడానికి ఈ నెల 20, 21 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించాలని కలెక్టర్ దాసరి హరి చందన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏండ్లు నిండిన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవడంతోపాటు చిరునామా, పోలింగ్ కేంద్రాల మార్పు వంటివి సవరణలు కూడా చేసుకోవచ్చని పేర్కొన్నారు. బూత్ లెవల్ అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితా ఫారం 6,8లతో రెండు రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ఓటర్లు, 18 ఏండ్లు నిండిన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్ దీనిపై శుక్రవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరిచందనతోపాటు అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డీఓలు రవి, శ్రీరాములు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

### ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో పని చేయాలి

గ్రామీణ ప్రాంతాల్లో ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ హరి చందన అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మిషన్ భగీరథ, ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మిషన్ భగీరథ శాఖ కార్యకలాపాలు, పథకాల అమలు గురించి ఇంజినీరింగ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజినీర్లు చెన్నారెడ్డి, లలిత, ఎస్ఈలు వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పాపారావు, వంశీ కృష్ణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## తడకమళ్ల పీఏసీఎస్‌లో వీగిన అవిశ్వాసం

- సభ్యులు రాక అవిశ్వాస తీర్మానం రద్దు



తడకమళ్ల పీఏసీఎస్ కార్యాలయంలో అవిశ్వాస సమావేశానికి సభ్యుల కోసం వేచి చూస్తున్న అధికారులు

మిర్యాలగూడ, జనవరి 19 : మండలంలోని తడకమళ్ల ప్రాథమిక సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్, వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. దాంతో అవిశ్వాస తీర్మానం రద్దు చేస్తున్నట్లు జిల్లా అధికారి ప్రకటించారు. తడకమళ్ల పీఏసీఎస్‌లో 13 మంది సభ్యులు ఉన్నారు. అందులో 9 మంది సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని డిసెంబర్ 20న జిల్లా అధికారికి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు జనవరి 18న అవిశ్వాస తీర్మానానికి హాజరు కావాలని అధికారులు సభ్యులకు నోటీసులు అందజేశారు. అయితే.. జిల్లా అధికారి అనారోగ్య కారణాల రీత్యా గురువారం జరుగాల్సిన సమావేశాన్ని శుక్రవారానికి వాయిదా వేశారు. శుక్రవారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు సమావేశం నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు వేచి చూసినా సభ్యులెవరూ హాజరు కాలేదు. సభ్యులు రాకపోవడంతో చివరికి అవిశ్వాసం వీగిపోయినట్లు జిల్లా సహకార అధికారి ఆర్.కిరణ్‌కుమార్ ప్రకటించారు. ఈ అవిశ్వాస తీర్మానానికి డీఎస్పీ వెంకటగిరి పర్యవేక్షణలో ఒక సీఐ, నలుగురు ఎస్ఐలు, 50 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆయా సొసైటీలు, మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెడుతున్నారు. ఈ క్రమంలోనే నల్లగొండ మున్సిపాలిటీ, వెలిమినేడు పీఏసీఎస్‌ను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో తడకమళ్ల సొసైటీకి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా కాంగ్రెస్ తన పంతాన్ని నెగ్గించుకోలేక అబాసుపాలైంది.

## అవిశ్వాసాలు వద్దు.. హామీలను అమలు చేయండి

- రైతులపై రాజకీయాలు చేయొద్దు
- రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ, జనవరి 19 : అమలుకు నోచని అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వాటిపై దృష్టి పెట్టాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు 420 హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేసి ప్రజలకు సుపరిపాలన అందిస్తే తమ పార్టీ తరపున సహకారం అందిస్తామన్నారు. రైతులకు మేలు చేస్తున్న సొసైటీలపై రాజకీయాలు చేయడం తగదని పేర్కొన్నారు. తడకమళ్ల పీఏసీఎస్ గతంలో అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, ప్రస్తుత పాలకవర్గం ఆధ్వర్యంలో లాభాల వైపు పయనిస్తుందని తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా రైతులకు ఇబ్బందులు లేకుండా సక్రమంగా ఎరువులు అందించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రైతుబంధు నేటికీ అందించలేకపోయిందని, రూ.2లక్షల రుణమాఫీ ఊసే లేకుండా పోయిందని, ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చే పరిస్థితి లేదని ఆరోపించారు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు భృతి ఊసే లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మెజారిటీ ఉన్న మున్సిపాలిటీలు, పీఏసీఎస్‌లలో కౌన్సిలర్లు, డైరెక్టర్లను ప్రలోభాలకు గురి చేసి అవిశ్వాసం పెట్టి పంతం నెగ్గించుకుంటున్నారని అన్నారు. తడకమళ్ల పీఏసీఎస్‌లో అవిశ్వాసం పెట్టి అబాసుపాలైందని ఎద్దేవా చేశారు. అవిశ్వాసాలను ప్రజలు, రైతులు హర్షించరని హితవు పలికారు. రైతులు, ప్రజల్లో వ్యతిరేకత వస్తే ఏ ప్రభుత్వమైనా పతనం కాక తప్పదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మట్టపల్లి సైదులు యాదవ్, వైస్ ఎంపీపీ అమరావతి సైదులు, నాయకులు మోహన్‌గౌడ్, శేఖర్‌రావు, రవి, నాగయ్య, భిక్షం, వెంకటయ్య, సోమయ్య పాల్గొన్నారు.






కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు, దళిత బంధు లబ్ధిదారులు

## దళిత బంధు ప్రక్రియను ప్రారంభించాలి

- దళిత బంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ పాలడుగు నాగార్జున

నల్లగొండ, జనవరి 19 : గత ప్రభుత్వ హయాంలో దళిత బంధు పథకం కింద ఎంపిక చేసిన లబ్ధిదారులకు నిధులు విడుదల చేసే ప్రక్రియను ప్రారంభించాలని దళిత బంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ పాలడుగు నాగార్జున, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత బంధు ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ శాలిగౌరారం మండల లబ్ధిదారులతో కలిసి కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వం భేషజాలకు పోకుండా, పార్టీల వైశమ్యాలను పక్కన పెట్టి దళిత బంధు గ్రౌండింగ్ చేపట్టాలన్నారు. ఎంపిక ప్రక్రియ మొత్తం పూర్తయిందని, నిధులను ఫ్రీజింగ్ చేయడం సరికాదని పేర్కొన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో 1050 మందికి ప్రొసీడింగ్స్ ఇచ్చారని, శాలిగౌరారం మండలంలో 270 మందిని ఎంపిక చేశారని తెలిపారు. ఎన్నికల కోడ్ రావడంతో గ్రౌండింగ్ ప్రక్రియ ఆగిపోయిందన్నారు. కొత్త ప్రభుత్వం వేగవంతంగా గ్రౌండింగ్ చేసి నిధులను విడుదల చేయాలని కోరారు. పందుల సైదులు మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి సంక్షేమ పథకాల వలే దళిత బంధును కొనసాగించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు దళిత బంధు లబ్ధిదారులకు రూ.12 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే దళిత, బహుజన, ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్ర స్థాయిలో ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మామిడి రమేశ్, ఏర్పుల నరేందర్, పోతెపాక నవీన్, బడుపుల శంకర్, యాకూబ్, రవీందర్, గణేశ్, వెంకట్, కిరణ్, ఎలీష, రవి, శంకర్, కమలాకర్ పాల్గొన్నారు.



నల్లమల అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న అటవీ జంతువులు

## నల్లమలలో పెరిగిన జంతువులు

- మూడు రోజులపాటు కొనసాగిన శాకాహార జంతు గణన
- డీఎఫ్ఓ సర్వేశ్వర్

చందంపేట, జనవరి 19 : నల్లమల అటవీ ప్రాంతంలో అధికారులు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. జంతువుల దాహార్తిని తీర్చేందుకు అటవీ ప్రాంతంలో నీటి తొట్ల ఏర్పాటుతోపాటు పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతం నల్లమల అటవీ ప్రాంతంలో శాకాహార జంతువుల సంఖ్య పెరిగిందని డీఎఫ్ఓ సర్వేశ్వర్ శుక్రవారం తెలిపారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు చేపట్టిన శాకాహార జంతు గణన పూర్తయిందని, ఇందులో జంతువుల సంఖ్య పెరిగినట్లు తేలిందని అన్నారు. చందంపేట మండలంలోని చిత్రియాల, పెద్దమూల, దాసర్లపల్లి, నల్లచెలమూల, బచ్చాపురం గ్రామ సరిహద్దుల్లో ఉన్న ఎర్రపేడ, పాలపేడ ప్రాంతాల్లో అటవీ జంతువుల గణన చేపట్టామన్నారు. ఆయా ప్రాంతాల్లో గతంలో కంటే జంతువుల సంఖ్య భారీగా పెరిగినట్లు చెప్పారు. నల్లమల అటవీ ప్రాంతంలో మనుబోతులు, దుప్పి, జింకలు, అడవి కుక్కలు, కృష్ణజింక, ముళ్ల పంది, అడవి పందులు, ఎలుగుబంట్లు, చిరుత పులుల సంఖ్య పెరిగినట్లు తెలిపారు. చిరుత పులిని ప్లగ్ మార్క్ ద్వారా గుర్తించినట్లు చెప్పారు. చిరుత పులుల సంఖ్య గతంలో కంటే పెరిగిందని డీఎఫ్ఓ తెలిపారు.

## నల్లగొండ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఆర్డీఓ రవి బాధ్యతల స్వీకరణ



ఇన్‌చార్జి కమిషనర్ రవికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న కౌన్సిలర్లు

నీలగిరి, జనవరి 19 : నల్లగొండ మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా నల్లగొండ ఆర్డీఓ రవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న కేవీ రమణాచారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఆయన స్థానంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈగా ఉన్న కందుకూరి వెంకటేశ్వర్లును తాత్కాలిక కమిషనర్‌గా నియమించగా ఆయన నెలరోజుల పాటు బాధ్యతలు నిర్వర్తించారు. పూర్తి కాలంగా ఆర్డీఓకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ నల్లగొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌కు మున్సిపల్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, కౌన్సిలర్లు ఖయ్యూంబేగ్, కేసాని వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ ఏసీసీ నాగిరెడ్డి, డీఈలు బొల్లూరి వెంకన్న, ఆశోక్, ఏఈ దిలీప్‌భార్గవ్ పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## జపాన్, జర్మనీలలో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తులు

నల్లగొండ రూరల్,జనవరి 19: రాష్ట్ర ప్రభుత్వం,కార్మిక, ఉపాధి శిక్షణ కర్మాగారాల శాఖ రిజిస్టర్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జపాన్, జర్మనీ దేశాలలో నర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22 నుంచి 30 ఏండ్ల వయస్సు ఉండి, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం డిప్లొమా పూర్తి చేసినవారు అర్హులని తెలిపారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులు నెలకు రూ.15 లక్షల నుంచి 18 లక్షల వరకు పొందవచ్చని పేర్కొన్నారు. జర్మనీలో నర్సింగ్ అప్రెంటిషిప్ కోసం 18 నుంచి 28 ఏండ్ల వయస్సులో ఇంటర్మీడియట్‌లో 60 శాతం అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. జర్మనీలో విజయవంతమైన ప్లేస్‌మెంట్ పై అభ్యర్థులు శిక్షణ సమయంలో నెలకు లక్ష స్టైఫండ్, ఉద్యోగ నియామకం తర్వాత నెలకు రూ.3 లక్షల జీతం పొందుతారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8919047600 ని సంప్రదించాలన్నారు.